క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారని పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు దిమ్మగుడి గ్రామంలో సోమవారం రాత్రి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాళ్లమని, ఇప్పుడు వలంటీర్లు ఇంటి వద్దే పింఛన్ అందిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

నేడు అశ్వత్థంలో బహిరంగ వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు పోగుచేసుకొను హక్కు కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పెద్దపప్పూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండలస్థాయిలో కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈఓఆర్డీ కమలాబాయి, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

యల్లనూరు: నిట్టూరు గ్రామంలోని నరేంద్ర అనే వ్యక్తి మద్యం అమ్ముతుండగా మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. నిందితుడి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు సురక్షితం



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యురాలు కీర్తన

యల్లనూరు: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు సురక్షితమని వైద్యురాలు కీర్తన అన్నారు. యల్లనూరు, తిమ్మంపల్లి పీహెచ్‌సీల్లో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద వైద్యాధికారులు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు గర్భిణులకు రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా డీపీఎంవో రామచంద్ర కుష్ఠ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గర్భిణులకు బొప్పేపల్లి గ్రామపెద్ద , వైఎస్సార్‌సీపీ నేత దేవన సుబ్బిరెడ్డి భోజన వసతిని కల్పించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణమ్మ, సూపర్‌వైజర్లు రాము, విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'గేట్స్'లో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ప్రముఖ మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అసెంచర్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 23 మం విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వార్షిక వేతనం ఒక్కొక్కరికి రూ.4.5 లక్షలు ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. అనంతరం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శాంతి, ఏఓ ఇంతియాజ్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ తన్వీర్ తదితరులు అభినందించారు.



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వేదికపై ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు



సామాజిక సాధికారయాత్రకు తరలివస్తున్న మహిళలు

గుంతకల్లు.. జనసంద్రం

- బైక్‌ర్యాలీ, గిరిజనుల సాంప్రదాయ నృత్యాలతో ఘనస్వాగతం
- జై జగన్ నినాదాలతో మిన్నంటిన అభిమానం
- బస్సుయాత్రకు అడుగడుగునా జన నీరాజనం



సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, చిత్రంలో నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఏ దారిలో చూసినా జనమే. ఎవరినోట విన్నా జగన్ నినాదమే. నియోజకవర్గంలోని దారులన్నీ మంగళవారం గుంతకల్లు వైపునకు సాగాయి. నియోజకవర్గంలో గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన జనంతో గుంతకల్లు కాస్త జనసంద్రంగా మారింది. సామాజిక నినాదం హోరెత్తింది. అభివృద్ధి మంత్రం వినిపించింది. ఏపీ సీఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా వర్గాలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు గుంతకల్లు నియోజకవర్గం ప్రజలు ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బీరప్పగుడి సర్కిల్ నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర మెయిన్‌రోడ్డు వైఎస్సార్ సర్కిల్‌లోని సభాస్థలికి చేరుకుంది. పార్టీకి చెందిన యువనాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పులగుట్టపల్లి తాండాకు చెందిన గిరిజన మహిళలు తమ సాంప్రదాయ నృత్యాలతో పార్టీ నేతలకు ఘనస్వాగతం పలికారు.

నూతనోత్తేజం

సీఎం జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ లబ్ధి ప్రజల్లో ఎంతగా అభిమానాన్ని పెంచిందో ఈ యాత్రకు వచ్చిన స్పందన కళ్లకు కట్టుకట్టినట్లు చూపింది. భారీ సంఖ్యలో పార్టీశ్రేణులు, ప్రజలు పాల్గొన్న ఈ యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, గుత్తి చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్లు పద్మలత, వరలక్ష్మి, గుంతకల్లు, గుత్తి, పామిడి ఎంపీపీలు మాధవి, విశాలక్ష్మి, భోగాతిము రళీరెడ్డి, వైస్ ఎంపీపీలు ప్రభావతి, తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, సౌభాగ్య, జడ్పీటీసీలు కదిరప్ప, రాధికాయాదవ్, శోభారాణి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఆలయాల ధర్మకర్తలు, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు, నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సామాజిక బస్సుయాత్ర సభ ప్రాంగణం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఉత్సాహం



వేదికపై కళాకారుల ప్రదర్శన



సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్యకర్తలు



బస్సుపై నుంచి నాయకుల అభివాదం



డ్రమ్స్ వాయిస్తున్న కళాకారులు



నాయకుల ప్రసంగానికి జనం కేరింతలు

రైల్వే ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు

గుత్తి: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయంలో సమీపంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో 80 మంది రిలే దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, ఓపెన్ లైన్ బ్రాంచ్ సెక్రటరీ శేఖర్ బాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్ రద్దు చేయాలన్నారు. మజ్దూర్ యూనియన్ ఓపెన్ బ్రాంచ్ లైన్ చైర్మన్ సుధీర్, డీజిల్ బ్రాంచ్ కార్యదర్శి రామాంజులరెడ్డి, నరసింహారావు, హెడ్ క్వార్టర్స్ బ్రాంచ్ కార్యదర్శి మనోహర్, సీనియర్ నాయకులు జగదీష్, అశోక్ కుమార్, త్యాగరాజు, రంగనాయకులు, రితీష్‌కుమార్, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



క్రీడాకారులకు టీ-షర్టులను అందిస్తున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నారని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నుంచి జరిగే మండల స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు టీ-షర్టులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతిభ కనబరచిన వారు బుధవారం నుంచి పట్టణంలోని ఎంఎస్ డిగ్రీ కళాశాల, ఫుట్‌బాల్ గ్రౌండ్, గుత్తి ఆర్ఎస్ రోడ్డులో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపిక అవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు హాజీమలంగ్‌బాబా, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ రాముడు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామీణ స్థాయి ముగిసిందని బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు పెద్దవడుగూరు, దిమ్మగుడి జెడ్పీహైస్కూల్ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తామన్నారు.

పుట్లూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రికెట్ పురుషుల విభాగంలో పుట్లూరు, కందికాపుల జట్లు, అరకటివేముల, కుమ్మనమల జట్లు, ఎల్లుట్ల, కడవకల్లు జట్లు మధ్య మ్యాచ్‌లు ఉంటాయన్నారు. బ్యాడ్మింటన్ సంబంధించి ఉదయం 8 గంటలకు, ఖోఖో పోటీలు సాయంత్రం 3.30 గంటలకు నిర్వహించనున్నట్లు వివరించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో బుధవారం నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. మండల కేంద్రంలోని కొట్టాలపల్లి రోడ్డు సమీపాన ఉన్న జెడ్పీ హైస్కూల్, సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ క్రీడా మైదానంలో మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

పామిడి: ఎదురూరు, గజరాంపల్లి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం వర్తింపజేస్తున్న 17 పథకాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, సర్పంచ్‌లు మహేశ్వరి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



మహిళతో సమస్యలు తెలుసుకుంటున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని 34వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి స్థానికులతో సమస్యలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్.జగన్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలుద్దామని పేర్కొన్నారు. నాయకులు పేరం ప్రతాప్ రెడ్డి, బాబా, అలీ, బాలరాజు తదితరులు ఉన్నారు.

తాడిపత్రిటౌన్: మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. చిన్న పోలమడ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై వాకబు చేశారు. సర్పంచ్ నాగేంద్రమ్మ జెడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, రమణారెడ్డి, భోగేశ్వరరెడ్డి, చంద్రలోకారెడ్డి, సురేష్‌కుమార్, విజయ్, నరేంద్ర, ఎల్‌బాబు, రామ్మోహన్‌రెడ్డి, వీరనాగప్ప పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయండి



గుత్తి శివారులోని బీపీసీఎల్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

గుత్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం డ్రైవర్లకు శాపంగా మారిందని వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేయాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు. పట్టణ శివార్లలోని బీపీసీఎల్ డిపో ఎదుట మంగళవారం డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత 106-2 హిట్ అండ్ రన్ అనే చట్టాన్ని తీసుకొచ్చి డ్రైవర్లు రోడ్డు ఎక్కాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏ డ్రైవరు ఉద్దేశ పూర్వకంగా ప్రమాదాలు చేయాలని ఆలోచించడని, అనుకోకుండా జరిగే ప్రమాదాలకు 10 ఏళ్ల జైలు శిక్షలు విధించేలా ఆ చట్టం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం నుంచి ఈ నెల 14 అర్ధరాత్రి 12 గంటల వరకూ స్టీరింగ్ డౌన్ పేరిట డ్రైవర్లు వాహనాలు నడపకుండా బంద్ చేస్తున్నామన్నారు. బుధవారం పట్టణ శివార్లలోని బీపీసీఎల్ డిపోను బందు చేయిస్తున్నామని డ్రైవర్లు విధులకు హాజరు కావద్దని వారు విజ్ఞప్తి చేశారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



యాడికి: మాట్లాడుతున్న బొంబాయి రమేష్ నాయుడు

యాడికి: పేదలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నం:1 గ్రామ సచివాలయంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమం ఈ ఏడాది జూన్ వరకు ఉంటుందన్నారు. వారంలో ఒక గ్రామం చొప్పున మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హాజరైన 469 మంది రోగులకు వైద్యాధికారులు శ్రీరామ్ కుమార్, శ్రీనివాసులురెడ్డి, మీనాక్షి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడునాయుడు, నాగరాజు, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి వార్డు సభ్యుడు తిరుపతి పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: గంగాదేవిపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్యాధికారి కేశవానంద దాదాపు 431 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు భగీరథ, శశికళ, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

గార్లదిన్నె: పెనకచెర్లకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ముత్యాలు ఇంటి ప్రహరీని అదే గ్రామానికి చెందిన మారెప్ప, రాజశేఖర్, రవితేజ పగలగొట్టారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గార్లదిన్నె: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఈవీఎం పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లను ఉపయోగించి ఓటు ఏ విధంగా వేయాలో తహసీల్దార్ ఉషారాణి తెలియజేశారు. ఓటరు ఎంచుకున్న అభ్యర్థికే ఓటు వేశామా లేదా అన్నది వీవీప్యాట్ ద్వారా నిర్ధారించుకోవాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు ఏఓ సోమశేఖర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రనాయక్, మండల పరిషత్ ఏఓ బాబా తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ కింద రాయితీతో పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్ తెలిపారు. రెండు పశువుల ఉన్న రైతుకు రూ.లక్ష, 4 పశువులు ఉన్న రైతుకు రూ.1.50 లక్షలు, 6 పశువులు ఉన్న రైతులకు రూ.1.80 లక్షలు ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పశు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పేకాటాడుతున్న 11 మంది జూదరులను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు..మంగళవారం రాత్రి పట్టణంలోని పాతకోట సమీపంలోని అయ్యస్వామి ఆలయం సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాటాడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈసందర్భంగా పేకాటాడుతున్న తలారి రంగయ్య, సంపంగి శ్రీరాములు, చిన్నపురెడ్డి మంజునాథరెడ్డి, కాటపు సుదర్శన్, కోనంకి పెద్దయ్యతో పాటు మరో ఆరుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.61,260 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు అర్బన్ ఎస్‌ఐ పేర్కొన్నారు.

పప్పు దినుసుల సాగు లాభదాయకం



కంది పంట పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దవడుగూరు : పప్పు దినుసుల సాగు లాభదాయకమని ఏఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. మంగళవారం క్రిష్టిపాడు గ్రామంలో ఆహార భద్రతా మిషన్ కింద కంది పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా కంది, కొర్ర, పెసర, జొన్న తదితర పంటలు సాగు చేసుకోవడం ఉత్తమమన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. ప్రతి రైతు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఏఈఓ రజిని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో దోపిడీ అరికట్టండి

గుత్తి రూరల్: పట్టణంలోని హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికల్లో గుంతలు తవ్వేవారి దోపిడీని అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పైమాలగేరి, బండగేరి, కుమ్మరగేరి, బెస్తగేరి, కోట వీధికి చెందిన కొందరు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ లలితకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండగేరికి చెందిన చంద్ర, రంగముణి, రమేష్, బాలు మాట్లాడుతూ పట్టణ శివార్లలోని నేమతబాదు వద్ద ఉన్న క్రైస్తవ శ్మశాన వాటికతో పాటుగా పట్టణంలో ఉన్న మరికొన్ని శ్మశానాల్లో మృతదేహాలు పూడ్చేందుకు గుంతలు తవ్వేందుకు కొందరు వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. గుంతలు తవ్వేందుకు కొందరికి అవకాశం ఉన్నప్పటికీ ఒకే వర్గానికి చెందిన వారు తవ్వుతుండటంతో వారు ఇష్టానుసారంగా డబ్బు వసూలు చేస్తున్నారని అన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని రేషన్ షాపులను విజిలెన్స్ అధికారులు వెంకటరమణ, ఏఓ వాసుప్రకాష్ , సీనియర్ అసిస్టెంట్ వెంకట్రాముడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల్లో సరుకుల నిల్వను పరిశీలించారు. నిత్యావసరాలను ప్రజలకు సక్రమంగా అందించాలని సూచించారు. డీటీ వెంకటేశ్వరమ్మ, వీఆర్వో అనిల్ పాల్గొన్నారు.